క్లుప్తంగా

2న రెడ్‌క్రాస్ ఎన్నికలు

కోదాడ : సూర్యాపేట డివిజన్ నుంచి కోదాడ రెడ్‌క్రాస్ డివిజన్ వేరైనందున ఆగస్టు 2వ తేదీన కోదాడ పట్టణంలో కోదాడ డివిజన్ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించనున్నట్లు కోదాడ ఆర్డీఓ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ ఎన్నికలలో పాల్గొనాలన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహకం



ఆర్థికసాయం అందజేస్తున్న కిరణ్మయి

నేరేడుచర్ల : దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఎస్ఎంసీ చైర్మన్ వారాల కిరణ్మయి అన్నారు. సోమవారం మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని జొన్నలగడ్డ పూజితకు ప్రోత్సాహకంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు రూ.2 వేలు, గ్రామానికి చెందిన బుర్రి సైదులు రూ.3 వేలను ఆమె చేతుల మీదుగా విద్యార్థికి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, కోటిరెడ్డి, శంకర్, వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అనంతగిరి : మండల పరిధిలోని గోంధ్రియాల, శాంతినగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం బీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బుర్రా సుధారాణి పుల్లారెడ్డి, బుర్రా రాఘవరెడ్డి, నర్సింహారెడ్డి, గోవిందరెడ్డి, బస్విరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

పాలకవీడు : భూములకు కొత్తగా పట్టా పాస్‌బుక్‌లు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పాస్ బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జీరాక్స్ కాపీలను తీసుకొని దగ్గరలోని రైతు వేదికల్లో ఏఈఓలను సంప్రదించాలని చెప్పారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



సాయిగౌడ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు

గరిడేపల్లి : మండలంలోని కాలువపల్లి గ్రామానికి చెందిన పి.సాయిగౌడ్ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి దాహన సంస్కారాలకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. సాయిగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఆయన వెంట ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుక్కల వెంకన్న, సభ్యులు మన్నెం వేణుయాదవ్, వీర్ల అంజి, నాగుల్ మీరా, శివారెడ్డి, జోష్ గౌడ్, అనీల్‌గౌడ్, వినయ్ స్థానికులు పాల్గొన్నారు.

'కేఆర్ఆర్'లో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ జాబ్ మేళా

కోదాడఅర్బన్ : కేఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగు ప్రారంభించారు. ఈ జాబ్ మేళాకు సుమారు 50 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ పరిశ్రమ ప్రతినిధులు మోహన్‌రావు, వెంకరెడ్డి, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్‌రెడ్డి, టీఎస్‌కేసీ ఎఫ్‌టీఎం శ్రావణి, ఇతర కళాశాల సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై కళాజాతా



మాట్లాడుతున్న ఎస్ఐ బాలకృష్ణ

మఠంపల్లి : ఆడపిల్లలకు షీటీమ్స్ రక్షణగా నిలుస్తున్నాయని, ఆడపిల్లలు, మహిళలు ఆకతాయిల నుంచి ఎదురయ్యే ఆపదలపై ఫిర్యాదు చేసి రక్షణ పొందాలని ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో జిల్లా ఎస్పీ, డీఎస్పీల ఆదేశాలతో పోలీస్ కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా షీటీమ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. టోల్‌ఫ్రీ నంబర్ 1930, 100 డైల్, సెల్‌ఫోన్ అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో గురుకుల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మంజుల, ఏఎస్ఐ సైదులు, పోలీసులు శివరాం, సాయిజ్యోతి, మనోహర్‌రెడ్డి, కళాజాతా బృందం యల్లయ్య, గోపయ్య, నాగార్జున, కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పంచాయతీ'లకు పక్కా భవనాలు

- మండలంలోని ఆరు గ్రామాలకు రూ.1.20 కోట్లు మంజూరు
- కొనసాగుతున్న నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అధికారులు పాలకవర్గాలు, ప్రజలు



లక్ష్మీపురం గ్రామంలో కొనసాగుతున్న పంచాయతీ భవన నిర్మాణ పనులు

గరిడేపల్లి : ప్రభుత్వం పాలనాసౌలభ్యం కోసం చిన్న గ్రామాలు, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. కానీ కొత్త పంచాయతీకు పక్కా భవానాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ అధికారులు, పాలకులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా భవనాల్లో గ్రామ సభలు, పాలకవర్గ సమావేశాలు కష్టతరంగా మారింది. వీటికి తోడు కొన్ని పంచాయతీల భవనాలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు నిర్మించాలని సంకల్పించింది. కొత్త గ్రామ పంచాయతీలు, పాత పంచాయతీల్లో శిథిలావస్థకు చేరిన భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులను ప్రారంభించింది.

మండలంలోని ఆరు గ్రామాలకు..

మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలలో పక్కా భవనాల నిర్మాణాలకు కోటి 20 లక్షల రూపాయలు మంజూరు కాగా ఒక్కొక్క గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం 20 లక్షల రూపాయలు కేటాయించింది. మండలంలోని కోనాయిగూడెం, మంగాపురం, కట్టవారిగూడెం, లక్ష్మీపురం, పొనుగోడు, గారకుంటతండా పంచాయతీలకు నిధులు మంజూరు అయ్యాయి. అయితే గారకుంటపాలెం గ్రామం మినహా మిగతా గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి.

అధునాతన సౌకర్యాలు..

అధునాతన సౌకర్యాలతో ఆరు నెలల్లోపు గ్రామ పంచాయతీల్లో పక్కా భవనాలు నిర్మించుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జూలై రెండవ వారంలో గారకుంటపాలెంలో సైతం పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కొక్క భవనానికి వెయ్యి చదరపు గజాల భూమిలో నిర్మాణం చేపడుతున్నారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి ప్రత్యేక గదులు, స్టోర్ రూమ్, సమావేశ మందిరం, కంప్యూటర్ గది, మల్టీపర్పస్ కార్మికుల రూములు నిర్మిస్తుండటంతో పాలకవర్గాలు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే స్థలం కేటాయించి భూమి పూజ కూడా నిర్వహించాం. ఈ భవనం నిర్మించడంతో చాలా వరకు ఇబ్బందులు తొలగుతాయి.

– కుసుమ వెంకటమ్మశ్రీనివాస్‌రెడ్డి సర్పంచ్, లక్ష్మీపురం

పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి



మండలంలో ఐదు గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గారకుంటతండా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం. మండలవ్యాప్తంగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. సకాలంలోనే పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

– నాయిని ప్రదీప్, పంచాయతీరాజ్ ఏఈ, గరిడేపల్లి

జేపీఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



గరిడేపల్లి : జేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

గరిడేపల్లి : జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పొనుగోడు గ్రామంలో జోగు పిచ్చిరెడ్డి 35వ వర్ధంతి సందర్భంగా జేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. ప్రభుత్వం అంతర్గ రోడ్లకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని, సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ లభించిందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జోగు సరోజని పిచ్చిరెడ్డి, ఎంపీటీసీలు మేళ్లచెరువు వెంకటమరణ, రామ్ సైదులు, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, జోగు అరవింద్‌రెడ్డి, పోరెడ్డి శ్రీలత, మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, సైదిరెడ్డి, సుధీర్, గురువయ్య, భాస్కర్, వీరయ్య తదితరులు ఉన్నారు.

తెలంగాణ సంస్కృతికి జాతరలు నిదర్శనం



కీతవారిగూడెంలో గంగమ్మ జాతరలో దోలు వాయిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

గరిడేపల్లి : తెలంగాణ సంస్కృతికి జాతరలు నిదర్శనమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో నిర్వహించిన గంగమ్మ జాతరకు ఆయన హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ముందుగా ఎమ్మెల్యేకు గ్రామ ప్రజలు బోనాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని శివాలయం వీధిలో రూ.8 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలతో మెరుగైన వైద్యం

- జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి కళ్యాణ్‌చక్రవర్తి



పల్లె దవాఖానా భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ కళ్యాణ్

కోదాడరూరల్ : పల్లె దవాఖానాలతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, తొగర్రాయి సర్పంచ్ దొంగల లక్ష్మీనారాయణలు అన్నారు. సోమవారం మండలంలోని తొగర్రాయిలో నూతన పల్లె దవాఖానా భవన నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ పల్లె దవాఖానాలో 134 రకాల వైద్య పరీక్షలు చేయబడతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 122 పల్లె దవాఖానాల భవన నిర్మాణాలు పనులు ప్రారంభించినట్లు డాక్టర్ కల్యాణ్ తెలిపారు. కార్యక్రమంలో కాపుగల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ లావణ్య, సిద్ధమ్మ, టీఎస్ఎంఐడీసీ అనిరుధ్, ప్రమీల, కార్యదర్శి అవినాష్ తదితరులు ఉన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జ్యోతి

నడిగూడెం : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పరిష్కరించాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తమ గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికపై విచారణ జరుగుతుందని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ బాణాల కవిత, వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ యం.యద్రయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాసాగర్‌రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం



విద్యాసాగర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌరీశంకర్, మాజీ ఎమ్మెల్యే పద్మావతి, తదితరులు

- సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్

కోదాడఅర్బన్ : పూర్వ మేళ్లచెరువు మండలంలో పులిచింతల ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టడంతో పాటు రాజకీయాలలోనూ నిబద్ధతతో వ్యవహరించిన గడ్డం విద్యాసాగర్‌రెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. సోమవారం విద్యాసాగర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా పట్టణంలో కోదాడ పబ్లిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొని సాగర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోదాడ కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాగర్ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకుడిగా విద్యార్థుల సమస్యలపై పోరాడారని పేర్కొన్నారు. అదేవిధంగా కార్యక్రమంలో పాల్గొన్న కోదాడ మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, ఉత్తమ్ పద్మావతిలు విద్యాసాగర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సాగర్ సౌమ్యుడిని, పార్టీలకతీతంగా అందరి మన్ననలు పొందాడని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు, మిత్రులు, రాజకీయ నాయకులు వల్లూరి రామిరెడ్డి, పైడిమర్రి సత్యబాబు, లక్ష్మీనారాయణరెడ్డి, వివిధ పార్టీల నాయకులు, సాగర్‌రెడ్డి మిత్రులు, బంధువులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ట్యాంక్ కూల్చివేత

- ఇంటి ప్రహరీపై పడిన ట్యాంక్ శిథిలాలు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన యజమాని



ప్రహరీపై పడిన నీటి ట్యాంక్

కోదాడరూరల్ : మండల పరిధిలోని చిమిర్యాలలో శిథిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంక్‌ను సోమవారం కూల్చివేశారు. 30 ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంక్ శిథిలావస్థకు చేరడంతో దానిని కూల్చివేసేందుకు గ్రామ పంచాయతీ, సంబంధిత అధికారులు తీర్మానించి వరంగల్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్‌కు కూల్చివేత పనులు అప్పగించారు. ట్యాంక్ పక్కన ఉన్న ఇళ్ల వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా కూల్చాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కానీ కాంట్రాక్టర్ సరైన చర్యలు తీసుకోకుండా కూల్చివేయడంతో ట్యాంక్ కూలీ పక్కనే ఉన్న ఇంటివైపు పడి ఇంటి ప్రహరీ కూలింది. దీంతో కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఇంటి యజమాని రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

గరిడేపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్‌కుమార్ కోరారు. సోమవారం మండలంలోని పొనుగోడు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి మౌలిక వసతులను కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జిలకర రామస్వామి, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, క్షత్రి సతీష్‌రెడ్డి, నవీన్, సురేష్ తదితరులు ఉన్నారు.

పేదలకు భరోసా సీఎం సహాయ నిధి

నేరేడుచర్ల : పేదలకు సీఎం సహాయ నిధి భరోసాగా నిలుస్తుందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చల్లా శ్రీలతారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబులు అన్నారు. సోమవారం నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో పొనుగంటి కృష్ణయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన లక్ష రూపాయల సీఎం సహాయ నిధి చెక్కును వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ పేదలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాగండ్ల శ్రీధర్, డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నాయకులు మార్కెండేయ, రమేష్‌బాబు నాయకులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



చిలుకూరులో సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్



మఠంపల్లిలో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

మునగాల : గ్రామ పంచాయతీల కార్మికల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మునగాలలో తెలంగాణ గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్మికులకు గౌరవ వేతనం రూ.19,500లు ఇవ్వాలన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు.అలాగే సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బచ్చలకూరి స్వరాజ్యం, ఏఐటీయూసీ మండల కార్యదర్శి సారెడ్డి రాఘవరెడ్డి సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బండారు గుర్వమ్మ, మండల శాఖ అధ్యక్షుడు వాసిమేకల వెంకటేశ్వర్లు, మండల నాయకులు ఎం.వెంకన్న, పి.నర్సయ్య, డి.రవి, పరుషరాములు, ముత్తయ్య, సైదులు, గోపిరెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల అడ్డగింత

మునగాల గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ చింతకాయల ఉపేందర్, పాలకవర్గం.. ప్రైవేటు వ్యక్తులను నియమించి సోమవారం పారిశుద్ధ్య పనులు చేయిస్తుండగా సమ్మెలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులు వారిని అడ్డుకున్నారు. సమ్మె చేస్తున్న తమను పట్టించుకోకుండా ఇతర కూలీలను నియమించుకొని పారిశుద్ధ్య పనులు చేయించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జీపీ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా మోకాళ్లపై కుర్చొని నిరసన వ్యక్తం చేశారు. వారికి ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు షేక్ హసన్‌మియా, రత్నం, యల్లమ్మ, ప్రసాద్, కొండల్, అంజయ్య, సునీల్, కనకయ్య, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు అండగా కాంగ్రెస్

మోతె : సమస్యలు పరిష్కరించాని సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.9000 నుంచి 18000ల వేతనం పెంచాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పులి ఈదయ్య, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు నర్సయ్య, కోల లింగయ్య, కారింగుల మూర్తి, కోల ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బంది ధర్నా

మఠంపల్లి : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ సిబ్బంది చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఐదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఇంటి రవి, మైసయ్య, దేవదానం, గురువారెడ్డి మోతీలాల్, నరసింహారావు, అమిత్, సంతోష్, దాసు తదితరులు ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

చిలుకూరు : గ్రామ పంచాయతీ కార్మికులకు పీఆర్‌సీలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్ వేతనం రూ.19 వేలు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన తెలిపి మాట్లాడారు. జీఓ నంబర్ 60 ప్రకారం స్వీపర్లకు, పంప్ ఆపరేటర్లకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకులు సాహెబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, వడ్డేపల్లి కోటేష్, కొడారు శ్రీను, బాలెబోయిన రవి, దొడ్డా నాగేశ్వరరావు, మహుముదాభేగం, జీపీ సంఘం అధ్యక్షుడు కట్టికోల శ్రీనివాస్‌రావు, జీపీ కార్మికులు తిరగమళ్ల వెంకటేశ్వర్లు, ఉపేందర్, తిరపయ్య, నాగేశ్వరరావు, నాగేంద్రబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఐదవ రోజు కొనసాగిన కార్మికుల సమ్మె

మేళ్లచెరువు : మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం ఐదవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ సిబ్బందిని పర్మినెంట్ చేయడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు, వెంకటేశ్వర్లు, భగవాన్, మరియమ్మ, శ్రీనివాసరావు, జ్యోతిరాణి, బాలాజీ, సైదా నాయక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె

కోదాడరూరల్ : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదని గ్రామ పంచాయతీ కార్మికులు అన్నారు. సోమవారం కార్మికులు చేస్తున్న సమ్మె ఐదవ రోజుకు చేరుకున్న సందర్భంగా పట్టణంలోని రంగా థియేటర్ సెంటర్‌లో వారి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారిని రెగ్యులరైజ్ చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం తమను పట్టించుకోపోవడం దారుణమన్నారు.

'మధ్యాహ్న' కార్మికుల టోకెన్ సమ్మె




మఠంపల్లిలో మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెలో మాట్లాడుతున్న శీలం శ్రీను

మఠంపల్లి : మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10 నుంచి 12 వరకు చేస్తున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మధ్యాహ్న ఏజెన్సీల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. సమయానికి బిల్లులు అందకపోయినా కార్మికులు అప్పులు చేసి పిల్లలకు భోజనం వండి పెడుతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.3 వేలు కూడా అందని వారికి అందని పరిస్థితి నెలకొందన్నారు. ఈనెల 12న జిల్లా కలెక్టరేట్ ముందు చేసే ధర్నాకు కార్మికులంతా కదలి రాలిరావాలన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ ఎస్‌డీ రన్‌మియా, కార్మికులు ధనమ్మ, శాంతకుమారి, పద్మ, కె.పుష్ప, సత్యావతి, లత, రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

కోదాడఅర్బన్ : మధ్యాహ్న భోజన కార్మికులు ఐక్య పోరాటాల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మిట్టగనుపుల ముత్యాలు పిలుపునిచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ కోదాడలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట సోమవారం కార్మికులు చేస్తున్న టోకెన్ సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపి మాట్లాడారు. కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గురజాల తిరుపతమ్మ, అన్నపూర్ణమ్మ, పుష్ప, నాగలక్ష్మి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు



కోదాడలో వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, విద్యార్థులు

కోదాడఅర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 12వ తేదీన నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సుగుణ డిగ్రీ కళాశాలలో బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విద్యార్థులతో కలిసి వారు ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందజేయాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాశోతు చందర్‌రావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.నరేష్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, సౌజన్య, మౌనిక, ఝాన్సీ, అక్షిత, హిందూ, నవ్య, శ్రావణి, స్పందన, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టడంలో విఫలం

హుజూర్‌నగర్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు ఈనెల 12న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చందర్‌రావు కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లో బంద్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నాగేష్, నాగరాజు, చిన్నబాబు, గోపి, మహేష్, సంతోష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు అవాస్తవం

మునగాల : మండలంలోని కలకోవలో గల ఊర చెరువు మట్టిని సీపీఎం నాయకుడి సహకారంతో అక్రమంగా తరలిస్తున్నారని గ్రామపంచాయతీ పాలకవర్గం చేసిన ఆరోపణలలో ఏ మాత్రం వాస్తవం లేదని గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు బుర్రి శ్రీరాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఊరచెరువు మట్టిని చెరువు పక్కనే ఉన్న భూమిలోకి తరలించిన మాట వాస్తవమేనని, చెరువు లోతట్టుగా ఉంటే నీరు నిల్వ ఉంటుందనే ఉద్దేశంతో చెరువులోని మట్టిని బయటకు డంపు చేసినట్లు తెలిపారు. మత్స్య సహకార సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న చెరువుపై పట్టు సాధించేందుకు గ్రామంలోని కొందరు బీఆర్ఎస్ నాయకులు, పంచాయతీ పాలకవర్గం తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. చెరువుమట్టిని అక్రమంగా ఇటుక బట్టీల వ్యాపారులకు అమ్ముకున్నట్లు గ్రామపంచాయతీ పాలకవర్గం నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

మఠంపల్లి : జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, ఆయన కుటుంబంపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టు పెట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మఠంపల్లి పోలీస్‌స్టేషన్‌లో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీను, సైదా, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

జీజేఆర్ కప్ క్రీడలు

సూర్యాపేట : జీజేఆర్ కప్ సూర్యాపేట నియోజకవర్గ స్థాయి క్రీడోత్సవాలు యువతలో స్ఫూర్తిని నింపుతున్నాయని 45వ వార్డు కౌన్సిలర్ పావని కృపాకర్ అన్నారు. జీజేఆర్ కప్ పట్టణ స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా సోమవారం 45వ వార్డులో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్ నాయకులు గండూరి కృపాకర్, మాజీ కౌన్సిలర్ సయ్యద్ సలీం, నాయకులు రాచకొండ శ్రీనివాస్, రంగు దిలీప్ కుమార్, రఫీ, తేరటపల్లి సతీష్, బజ్జూరు శ్రీనివాస్, మిట్టపల్లి రమేష్, లతీఫ్, చారి, విజయ, డాక్టర్ దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.